

వరద బాధితులకు 'మానవత' రూ.లక్ష విరాళం

కలెక్టర్ వెట్రిసెల్వి అభినందన

ఏలూరు : వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో చేయూత నందిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆధ్వర్యంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వికి జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు, కార్యదర్శి పి.దేవరత్నాకరరావు, ఆడిటింగ్ కమిటీ డైరెక్టర్ కడియాల కృష్ణారావు, డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ మేతర అజేయ్‌బాబు, ఏలూరు విభాగం ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, డైరెక్టర్ ఎం.కుమార్, కోశాధికారి అల్లూరి మోహిని, సంయుక్త కార్యదర్శి పైడి కస్తూరిబాయి, పూర్వ కార్యనిర్వాహక సభ్యులు రామారావు ఉన్నారు.

'ఫీజు' పరేషాన్..!

- అగమ్యగోచరంగా ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చదివే విద్యార్థుల పరిస్థితి
- గత ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల ఫీజు పెండింగ్
- ఈ ఏడాది తొలివిడత ఫీజు సొమ్ము విడుదలపై స్పష్టత కరువు
- ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిడి
- రెండు జిల్లాల్లో దాదాపు 40 వేల మందికిపైగా విద్యార్థుల అవస్థలు
- హాస్టల్ ఫీజుల చెల్లింపులపై ప్రభుత్వం మౌనం
- అప్పులు చేయాల్సి రావడంతో తల్లిదండ్రులు మనోవేదన




ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం, అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి విద్యార్థులు బలిపశువులుగా మారుతున్న పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో యాజమాన్యాల నుంచి విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 వేల మందికి పైగా విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సులను అభ్యసిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యలో కాలేజీలో వసతులను బట్టి రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదువేల వరకూ ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. హాస్టల్ ఫీజు కింద మరో రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ కాలేజీలు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నమ్ముకుని ఎంతోమంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి కోర్సులను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్ములను ఏడాదిలో నాలుగు విడతలుగా చెల్లించేది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేవలం ఒక్క విడత మాత్రమే విద్యార్థుల ఖాతాల్లో వేసింది. రూ.64 వేలు ఫీజు చెల్లించాల్సిన విద్యార్థికి రూ.16 వేలు మాత్రమే జమచేసింది. ఇంకా రూ.48 వేల ఫీజు అప్పటి వైసిపి ప్రభుత్వం చెల్లించలేదు. ఎన్నికల్లో టిడిపి కూటమి గెలిచింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు జమకు సంబంధించి ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు.

గత ఏడాది ఫీజు లేదు.. ఈ ఏడాది ఫీజుపై స్పష్టత కరువు

గత ఏడాదికి సంబంధించి పూర్తి ఫీజు చెల్లిస్తే తప్ప రెండో సెమిస్టర్ పరీక్షలు రాయడానికి కాలేజీ యాజమాన్యాలు ఒప్పుకోలేదు. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి గతేడాది ఫీజులు చెల్లించారు. ప్రభుత్వం ఆ సొమ్ములు వేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తరగతులు ప్రారంభం కావడమే కాకుండా, మిడ్ పరీక్షలు సైతం కొనసాగుతున్నాయి. కొన్ని కాలేజీల్లో ఒకటి, రెండు రోజుల్లో మిడ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి విడత ఫీజు చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాల నుంచి విద్యార్థులపై ఒత్తిడి మొదలైంది. దీంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గతేడాది ఫీజుల కోసం చేసిన అప్పులు అలానే ఉన్నాయి. ఈ ఏడాది ఫీజుల పరిస్థితి ఏంటన్న బెంగ తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఉన్నత విద్యాశాఖా మంత్రిగా ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ ఉన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇక నుంచి ఫీజు సొమ్ములు కాలేజీ యాజమాన్యాల ఖాతాలో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా చెప్పిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మొదటి విడత ఫీజు ఎప్పటిలోగా వేస్తారు, ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని విద్యార్థులు కోరుతున్నారు. కాలేజీ యాజమాన్యాల నుంచి ఒత్తిడి లేకుండా చేయాలని అడుగుతున్నారు. అంతేకాకుండా గతేడాది పెండింగ్ ఫీజును వెంటనే విడుదల చేయాలని వేడుకుంటున్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు గత ప్రభుత్వం వసతి దీవెన పేరుతో రెండు విడతలుగా ఏడాదికి రూ.20 వేలు ఇచ్చేది. గత విద్యాసంవత్సరానికి సంబంధించి వసతి దీవెన సొమ్ములు వైసిపి ప్రభుత్వం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం హాస్టల్ ఫీజుల సొమ్ముల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

కార్పొరేషన్ టిడిపి కైవసం..!

- మరో ఐదుగురు వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరిక
- 47 మందికి 27 మంది కార్పొరేటర్లు టిడిపి తీర్థం
- డిప్యూటీ మేయర్లు, విప్, కోఆప్షన్ పదవులు ఎవరికో?
- మేయర్‌గా నూర్జహాన్ ఉంటారా?
- గౌరవమైన రాజకీయం, అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌ఎ చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు కార్పొరేషన్‌ను టిడిపి కైవసం చేసుకుంది. ఎంఎల్‌ఎ బడేటి చంటి ఆధ్వర్యంలో శుక్రవారం మరో ఐదుగురు వైసిపి కార్పొరేటర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దీంతో వైసిపికి చెందిన 47 మంది కార్పొరేటర్లలో 27 మంది టిడిపిలోకి చేరారు. ఏలూరు కార్పొరేషన్‌లో మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉండగా 47 మంది వైసిపి కార్పొరేటర్లు, ముగ్గురు టిడిపి కార్పొరేటర్లు గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కూటమి గెలవడంతో మేయర్‌తోపాటు 27 మంది వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. దీంతో టిడిపి బలం 30 మందికి చేరడంతో కార్పొరేషన్ మేయర్ పదవి నుంచి అన్ని పదవులూ టిడిపి వశం కానున్నాయి. విచిత్రం ఏంటంటే కార్పొరేటర్లు పార్టీ మారడం తప్ప, మేయర్ పదవి మాత్రం వైసిపి నుంచి గెలిచిన షేక్ నూర్జహాన్ కొనసాగించుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎవరిపైన అయితే కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఢీకొట్టారో ఆనాయకుల కిందే మళ్లీ పనిచేయాల్సిన పరిస్థితి నెలకొనడం టిడిపి క్యాడర్ జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వైసిపి హయాంలో నియమితులైన డిప్యూటీ మేయర్లు, విప్, కోఆప్షన్ సభ్యుల పదవులకు రాజీనామా చేశారు. కొత్తవారిని ఎన్నుకునేందుకు చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పదవులు ఎవరికిస్తారో చూడాల్సి ఉంది. అదే క్రమంలో మేయర్‌గా నూర్జహాన్‌ను కొనసాగిస్తారా.. లేక మారుస్తారా అన్న చర్చ సైతం కొనసాగుతోంది.

గౌరవమైన రాజకీయం, అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌ఎ చంటి

గౌరవంతో కూడిన రాజకీయం, అభివృద్ధితో కూడిన ఆంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సువర్ణ పాలన అందిస్తున్నారని, అదేస్ఫూర్తితో ఏలూరు నియోజకవర్గంలో ఆదర్శవంతమైన పాలనకు తాను కూడా శ్రీకారం చుట్టానని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి తెలిపారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎంఎల్‌ఎ బడేటి చంటి సమక్షంలో ఏలూరు కార్పొరేషన్‌కు చెందిన ఐదుగురు వైసిపి కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్‌కుమార్, దారపు అనూష, కలవకొల్లు సాంబ, అర్జి సత్యవతి, జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎంఎల్‌ఎ చంటి పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాజకీయాల్లో గౌరవం, విలువలు అనేవి ఎంతో కీలకమన్నారు. టిడిపి నేతలందరితో చర్చించి వైసిపిని వీడి టిడిపిలోకి వచ్చేవారిని స్వాగతిస్తున్నామన్నారు. పార్టీ నేతలెవ్వరూ అధైర్యపడొద్దని, ఈ విషయంలో ఎక్కడా రాజీపడే పరిస్థితి లేదని, పార్టీని నమ్ముకుని ఉన్నవారికి తగిన గుర్తింపు ఉంటుందని తేల్చిచెప్పిన ఆయన ఐకమత్యంతో కలిసి అడుగులేసి అభివద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో అందరూ భాగస్వాములవ్వాలని స్పష్టం చేశారు. చరిత్రను తిరగరాసి, తాను కలలుగన్న ఏలూరును సాకారం చేసే దిశగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ, అభివృద్ధి పాలనకు సహకరించాలన్నారు. ఇందులో మరోమాటకు అవకాశం లేదని మరోసారి నొక్కి చెప్పారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ అభివద్ధి, సంక్షేమంతో సాగుతున్న కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలనలో భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చిన వారికి టిడిపిలో స్థానం ఉంటుందన్నారు. అదే ఆలోచనతో ఇప్పటివరకూ 27 మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరారని, త్వరలో ఇద్దరు డిప్యూటీ మేయర్లు, ముగ్గురు కో - ఆప్షన్ మెంబర్లు, ఒక విప్‌ను భర్తీ చేసుకుంటామని వెల్లడించారు. వీరందరినీ కలుపుకుని త్వరలో నూతన పదవులను కేటాయిస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారికి మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు పెద్దిబోయిన శివప్రసాద్, ఎంఆర్‌డి బలరాం, బొద్దాని శ్రీనివాస్, రెడ్డి నాగరాజు, మంచెం మైబాబు పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ఇంకా ముంపులోనే దాచారం - కుక్కునూరు కాజ్‌వే



కుక్కునూరు - దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వేపై వరద

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆరు రోజులుగా పెరుగుతూ విలీన మండలాల ప్రజల కంటిమీద కునుకులేకుండా చేసిన గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. దీంతో శుక్రవారం ముత్యాలంపాడు - వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపై వరద వీడింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు కొనసాగాయి. వరద తగ్గుముఖం పట్టినా కుక్కునూరు - దాచారం మధ్య గుండేటివాగుపై కాజ్‌వేను వరద వీడకపోవడంతో 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు ఇంకా కొనసాగలేదు. వరద ముంచెత్తడంతో పత్తి, మిర్చి పంటల వేసిన రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. వరదలు తగ్గుముఖం పట్టడంతో నష్టపోయిన పంట పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. భద్రాచలంలో నీటి మట్టం 39 అడుగులకు చేరడంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ప్రణాళికతో వారు సంతృప్తి చెందేలా ధాన్యం సేకరించేందుకు సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, పౌర సరఫరాలు, రైతులు, తహశీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, ట్రాన్స్ పోర్టర్లు, తదితరులతో ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళికలో భాగంగా పాటించాల్సిన ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని అంచనా ఉండగా అందులో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో వరి పండే ప్రతి గ్రామంలో దిగుబడి అంచనా ప్రకారం 3 కేటగిరీలు చేసి 247 ధాన్యం రైతు సేవా కేంద్రాలను క్లస్టరింగ్ ద్వారా కొనుగోలు కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. అక్టోబరు 2వ వారం నుంచి ప్రారంభమై ఫిబ్రవరి నాటికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగుస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా నెలల్లో ఎంతమేర ధాన్యం వస్తుంది అంచనా వేసి అందుకు అనుగుణంగా ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. దళారుల నుండి మోసపోకుండా రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేలా రైతులను అవగాహన పరచాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం నాణ్యత, పరిమాణం, తేమ శాతంలో ఎలాంటి తేడా లేకుండా సజావుగా ఉండేలా పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. రైతులకు అనువైన విధంగా ధాన్యం సేకరణ కేంద్రాలను రైస్ మిల్లులకు సమన్వయం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ చేయాలని, గోనె సంచులు, వేయింగ్ మిషన్లు, తేమశాతం కొలిచే పరికరాలు తదితర వంటి వాటిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యం సేకరణలో రైతులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ముందే గ్రామస్థాయిలో ఇ-పంట నమోదు, ఇకెవైసి ద్వారా రైతులు, కౌలు రైతుల వివరాలను పూర్తి జాగ్రత్తతో ఆన్ లైన్లో నమోదు చేయాలన్నారు. ప్రొక్యూర్ మెంట్ సపోర్టింగ్ సంస్థలచే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించి వారికి తగు శిక్షణ అందించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణకు జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రోలజీ, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి, ప్రెసిడెంట్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఇతర సంబందిత విభాగాల అధికారులతో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే డివిజన్, మండల, గ్రామ స్థాయిలో ధాన్యం సేకరణ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఖరీఫ్ లో ధాన్యంను క్వింటాలుకు కామన్ రకమును రూ 2,300, గ్రేడ్ ఏ రకాన్ని రూ. 2,320 చొప్పున ప్రభుత్వం (కనీస మద్దతు ధరకు) కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలు, సమకూర్చి రైతుల సౌలభ్యం కోసం ధాన్యాన్ని రైతుల కళ్లాల వద్ద నుండే సేకరించి ర్యాండమైజేషన్ పద్దతిలో కాకుండా సమీప రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించడం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న రైస్ మిల్లర్స్ అసోషియేషన్ సభ్యులు, ట్రాన్స్ పోర్టర్లు, తదితరులు ధాన్యం సేకరణలో పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ కె.మంజూ భార్గవి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్‌కె హబీబ్ బాషా పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవాలి

బ్యాంకర్లకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి

ఏలూరు : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లాలో వరదల కారణంగా నష్టపోయిన రైతాంగం, ప్రజలకు రుణ సౌకర్యంపై బ్యాంకర్లతో ప్రత్యేక డిసిసి సమావేశం ఏర్పాటుచేసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ జిల్లాలో 15 రోజుల పాటు భారీ వర్షాలు, వరదలు భారీ విపత్తును సృష్టించా యన్నారు. రైతులు తమ చేతికందే పంటను నష్టపోయా రని, ప్రజలు అనేక విధాలుగా నష్టపోయారన్నారు. ఇటువం టి పరిస్థితుల్లో జిల్లాలో ప్రకృతి సృష్టించిన విలయాన్ని విపత్తుగా ప్రకటించి, రైతులు, ప్రజలకు బ్యాంకర్లు ఉపశమన చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా కొల్లేరు ప్రాంతంలోని కైకలూరు, కలిదిండి, పెదపాడు, ఏలూరు రురల్, మండవల్లి, నూజివీడు, ముసునూరు, అగిరిపల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, తదితర మండలాల్లో అధిక నష్టం కలిగిందన్నారు. వరదల కారణంగా రైతులు ముఖ్యంగా వరి, మత్స్య, ఉద్యాన పంటల రైతులు బాగా నష్టపోయారని, పాడిపశువులు కూడా చనిపోయా యన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రైతుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేయడం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలన్నారు. బీమా క్లెయిముల పరిష్కారంలో రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు, వస్తువులు కోల్పోయిన బాధితులకు సంబంధించి భీమా క్లైములను కూడా వెంటనే పరిష్కరించాలని, బాధితుల రుణాలను కూడా కొంత మారటోరియం సమయం ఇచ్చి రీషెడ్యూలు చేయాలన్నారు. రైతులు పంటల బీమా పరిహారం, రుణాల రీషెడ్యూలు కోసం దరఖాస్తులను పంటలు దెబ్బ తిన్న రైతుల నుంచి వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల అధికారులు సేకరించాలని, ఇందుకోసం ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు పాటు పడాలి

పలుచోట్ల సంతాప సభలు

ప్రజాశక్తి - పెదపాడు

దేశం గర్వించదగ్గ గొప్ప మేధావిని కోల్పోయామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో శుక్రవారం సిపిఎం పెదపాడు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఇటీవల మరణించిన మాజీ ఎంఎల్ఎ, సిపిఎం రాష్ట్ర నాయకులు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ కరీముల్లా, గుండపనేని సురేష్, పి.రహేల్, రెడ్డి లక్ష్మణరావు, నీలపాల వెంకటేశ్వరరావు, ఎం.కొండలరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సిపిఎంకు, వామపక్ష , ప్రజాతంత్ర ఉద్యమానికి, సెక్యులర్ శక్తులకు తీరని లోటని, వారి ఆశయ సాధన కోసం పని చేయటమే వారికి నిజమైన నివాళులని సిపిఎం జిల్లా కేంద్రం శాఖ కార్యదర్శి పి.ఆదిశేషు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతికి విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఏచూరి మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి, విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించడానికి విరామం ఎరుగక కృషి చేసిన నిత్య శ్రామికుడని కొనియాడారు.



పెదపాడులో...



జంగారెడ్డిగూడెంలో...

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని ఉమ్మడి ఎపి ఎన్‌జిఒస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏచూరి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఏచూరి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఏచూరి అడుగుజాడల్లో నడవటమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి సిఐటియు భవనంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, ఆగిరిపల్లి మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, నూజివీడు టౌన్ కార్యదర్శి ఎఆర్.హనుమాన్లు, సిపిఎం నాయకులు ఎస్.కోటేశ్వరరావు, జె.గోపాలరావు, ఎం.రాజారావు, ఆర్.చంటి, ఎం.నరేష్, రవీంద్ర జహాంగీర్ బాషా, అయ్యప్ప, సుధాకర్, సుందరం, సామ్యేలు పాల్గొన్నారు.

కుక్కునూరు : సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో సీతారాం చిత్రపటానికి సిపిఎం మండల కమిటీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయాలు ముందుకు తీసు కెళ్లడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, భయ్యాన శ్రీను, షేక్ వలీపాషా, పులదాసు రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు మహబూబ్ పాషా, ప్రజాశక్తి విలేకరి విశ్వనాధ్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి రాంబాబు ఇంటి వద్ద సంతాప సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి రాంబాబు, శాఖ కార్యదర్శి దుర్గారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం : సిపిఎం జంగారెడ్డిగూడెం మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సంతాప సభ జి.సూర్యకిరణ్ అధ్యక్షతన నిర్వహించారు. సీతారాం చిత్రపటానికి మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, టౌన్ కమిటీ సభ్యురాలు ఎస్‌కె సుభాషిణి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల, టౌన్ కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు, వంగ గోపీ నాయుడు, వెంకన్న, కార్మిక నాయకులు డి.ఆశీర్వాదం, కె.స్టాలిన్, పి.సునీల్, పి.వెంకటేశ్వరరావు, కె.రెడ్డి బొబ్బిలి గంగరాజు, బి.ఆనందరావు పాల్గొన్నారు.



నూజివీడులో...

వేలేరుపాడు రూరల్ : సిపిఎం వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో కరాటం ప్రకాష్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడారు. సీతారాం ఏచూరి మృతి సిపిఎంకు ఎప్పటికీ పూడ్చలేని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఊకె రాజులు, తొండ సీతయ్య, సవలం లింగయ్య, ఊకె ముత్యాలు, పురేం కిట్టయ్య, సోడే ప్రసాద్, సవలం భీమమ్మ, సీతమ్మ, ధర్మాల నాగేంద్రబాబు పాల్గొన్నారు.


చింతలపూడి : సిపిఎం చింతలపూడి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సంతాప సభ నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.సూర్యకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ, సీనియర్ నాయకులు సూర్యకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కె.గురవయ్యా, రైతు సంఘం జిల్లా ప్రెసిడెంట్ పి.సోమశేఖర్, చింతలపూడి మాజీ గ్రామ సర్పంచి, టిడిపి నాయకులు చిట్లూరి ధర్మరాజు, పట్టణ పెద్దలు గుడిమెట్ల శ్రీరాములు, జనసేన నాయకులు ఆర్నేపల్లి అప్పారావు, వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు మళ్లగిరి ఇమ్మానియేలు, సిఐటియు మండలాధ్యక్ష కార్యదర్శులు నత్త వెంకటేశ్వర్లు, ఎం.బాలరాజు, ఎఐటియుసి జిల్లా తుర్లపాటి బాబు పాల్గొన్నారు.

సిపిఐ కార్యా లయంలో నిర్వహించిన సంతాప సభలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడారు. ఈ సంతాప సభలో సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, మండల సహాయ కార్యదర్శి పుల్లూరు సోమశేఖర్, తుర్లపాటి బాబు, గంధం అంజమ్మ, ఎస్‌కె మస్తాన్, గట్టు వెంకటేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో...

నూజివీడు టౌన్ : సిపిఎం నూజివీడు మండల కమిటీ ఆధ్వర్యంలో పల్లెర్లమూడి గ్రామంలో సంతాప సభ నిర్వహించారు. సీతారాం చిత్రపటానికి సిపిఎం నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు పి.సుభాష్ చంద్రబోస్, కె.సామ్యేలు, ఆర్.ప్రసాద్, ఎం.లక్ష్మయ్య, సిపిఎం నాయకులు రంగారావు, అనిల్, జి.పాపారావు, ఎస్.సుబ్బారావు, జోగారావు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరికి విప్లవ జోహార్లు అర్పిస్తూ శనివారపుపేటకు చెందిన డ్రాయింగ్ టీచర్ మహమ్మద్ ఇర్షాద్ గీసిన చిత్రం

17 నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల భాగస్వామ్యం, అవగాహన, సహకారంతో ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో స్వచ్ఛభారత్ మిషన్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

ట్రిపుల్ ఐటిలో సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు ట్రిపుల్ ఐటిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు విద్యార్థుల కోరిక మేరకు అదనపు సౌకర్యాలు ఏర్పాటుకు కృషి చేస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటిని ఆయన శుక్రవారం సందర్శించారు. మెస్‌లలో పరిశుభ్రత, ఆవరణలోని ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రోజు పెట్టే ఆహారం ఎలా ఉంటుందని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఏమిటని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటిలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనను పంపినట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు, సిబ్బందికి ఉన్న సమస్యలు తన దృష్టిలో ఉన్నట్లు తెలిపారు. ప్రపంచస్థాయి విద్యను అందించే కళాశాల మసకబారే పరిస్థితులు రానివ్వబోమన్నారు.

నూజివీడు పట్టణ సిఐగా సత్యశ్రీనివాస్ బాధ్యతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ సిఐగా పి.సత్యశ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే తన ధ్యేయమన్నారు.

ఎన్ఆర్ఐ విద్యార్థుల ఆహ్వాన వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థిని

ఎన్ఆర్ఐ డిగ్రీ, జూనియర్ విద్యార్థులు ఆహ్వాన వేడుకలు గ్రీన్ సిటీ సూర్యతేజ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల సిఇఒ వి.తులసీరామ్ మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విద్యార్థులు ఒకరికొకరు స్నేహపూర్వక అవినాభావ సంబంధం కలిగి ఉండాలని, సీనియర్స్ నుంచి జూనియర్స్ వారి అనుభవ విజ్ఞానాన్ని నేర్చుకుని అందరూ కలిసి స్నేహపూర్వక వాతావరణంలో విద్యాసంవత్సరంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ విద్య పూర్తయ్యే లోపే ఉన్నత ఉద్యోగాలు పొందేవిధంగా ప్రారంభ సంవత్సరం నుంచే అపార అనుభవం కలిగిన మంచి శిక్షకులను నియమించి వారి ద్వారా విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం అన్ని సెమిస్టర్ ఫలితాల్లో సున్న గ్రేడు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ఎన్‌వి.సత్యనారాయణ, ఎఒ ఎ.చంద్రశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని సరిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మూడు నెలల్లోనే ఈ అభివృద్ధి పనిని చేపట్టిందన్నారు.

17న నులి పురుగుల నివారణ కార్యక్రమం

చాట్రాయి :ఈ నెల 17వ తేదీన నులి పురుగు నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చాట్రాయి పిహెచ్‌సి వైద్యాధికారి కె.విజయలక్ష్మి, మండల విద్యా శాఖాధికారి బ్రహ్మచారి తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అంగన్వాడీ సెంటర్లకు, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించినట్లు తెలిపారు.

పాతూరి వెంకటేశ్వరరావు వర్ధంతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పాతూరి వెంకటేశ్వరరావు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కమ్యూనిస్టు పాటు పడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. పాతూరి వెంకటేశ్వరరావు 18వ వర్ధంతి సందర్భంగా ఆగిరిపల్లిలోని సుందరయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆగిరిపల్లి కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, ఎస్.కోటేశ్వరరావు, నూజివీడు టౌన్ కార్యదర్శి హనుమాన్లు, జె.గోపాలరావు, ఎం.రాజారావు, ఆర్.చంటి, ఎం.నరేష్, రవీంద్ర, జహాంగీర్ బాషా, సుధాకర్, అయ్యప్ప, సామ్యేలు పాల్గొన్నారు.

సోలార్ ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటును ఆదా చేసుకోవాలని, సోలార్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. చింతలపూడి మండలంలో కనమత రాజశేఖర్‌రెడ్డి ఇంటిపై మొదటి సోలార్ ఏర్పాటు చేస్తున్నట్లు, ముందుకు వచ్చినందుకు ఆయనను అభినందించారు.

పెండింగ్ బిల్లులు పూర్తి చేస్తాం

చింతలపూడి :2014 నుంచి 2019 వరకు గృహ లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు కూటమి ప్రభుత్వం క్లియర్ చేస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద హౌసింగ్ డిఇకి శుక్రవారం ఆర్డర్ కాపీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 2,809 ఇళ్లకు వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకున్న ప్రతి లబ్ధిదారుడిని అధికారులు సక్రమంగా గుర్తించాలని తెలిపారు. ప్రజా సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి పేదవాడిని ఆదుకునే ఆలోచనతో ముందడుగులు వేస్తున్నామన్నారు. పూర్ టు రిచ్ కార్యక్రమం ద్వారా సంక్షేమం దిశగా ప్రతి పేదవాడిని ఆదుకుంటున్నామన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలిక కిడ్నాప్ కేసులో ముగ్గురు అరెస్టు

24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని ఒక గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గండికోట దశరథ్ అనే వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయింది. సదరు బాలికను గండికోట దశరథ్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించి ఈ నెల 11వ తేదీ దశరథ్ తన తల్లిదండ్రులు, బాబాయి, ఇద్దరు బావలు కలిసి కారులో బాలిక ఇంటి వద్దకు వచ్చి మాయమాటలు చెప్పి లొంగదీసుకొని పెళ్లి చేసుకోవడానికి తీసుకెళ్లి పోయినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో, భీమడోలు సిఐ జోసఫ్ విల్సన్ పర్యవేక్షణలో ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ వారి సిబ్బందితో కలిసి బాలిక ఆచూకీ తెలుసుకున్నారు. బాలికను కిడ్నాప్ చేసిన గండికోట దశరథ్, అతని తండ్రి గండికోట ఎల్లయ్య, తల్లి గండికోట లక్ష్మిలను అరెస్టు చేశారు. బాలికను కిడ్నాప్ చేసేందుకు ఉపయోగించిన కారును సీజ్ చేశారు. ఈ కేసులో దశరథ్ బాబాయి గండికోట అశోక్, బావలు పండ్ల రాము, వల్లపు సురేష్‌లను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

జిఒ 85 రద్దు కోరుతూ వైద్య సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

జిఒ 85 రద్దు చేయాలని కోరుతూ మండలంలోని బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం వైద్య సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎస్‌కె.ఇమామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 85 ఇవ్వడం దారుణమన్నారు. ఈ జిఒతో వైద్యాధికారులుగా పనిచేస్తున్న వైద్యులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇంతకాలం చేసిన సర్వీస్ ఉపయోగం లేకుండా పోయిందన్నారు. అర్ధాంతరంగా జిఒలు మార్చడం వల్ల వైద్య వృత్తికి తమ ప్రగతికి అన్యాయం జరుగుతుందన్నారు. జిఒ 85 రద్దు చేసి వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో డాక్టర్ ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంఎంసి మాజీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి - కామవరపుకోట


అశోక్ శ్రీనివాస్ (ఫైల్)

మండలంలోని కెఎస్.రామవరం గ్రామానికి చెందిన చింతలపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, వైసిపి ముఖ్య నాయకులు మేడవరపు అశోక్ శ్రీనివాస్ (65) విశాఖపట్నంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. ఆయన పుట్టిన ఊరు ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామం. ఆయన కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి.రామచంద్రరావుకు సొంత బావమరిది. ఆయన భార్య మేడవరపు విజయలక్ష్మి ప్రస్తుతం కామవరపుకోట ఎంపిపిగా, ఆయన కుమార్తె నమృత కెఎస్.రామవరం సర్పంచి ఉన్నారు. ఆయన మృతదేహాన్ని తడికలపూడి తీసుకురాగా అక్కడ నుంచి కార్యకర్తలు, అభిమానుల నడుమ భారీ ర్యాలీగా కెఎస్.రామవరంలోని స్వగృహానికి తరలించారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎంపీలు కెవిపి.రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంఎల్ఎ మురళీ, కిలారు సత్యనారాయణ, కంభం విజయరాజు, కోనేరు సుబ్బారావు, పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారులు, స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వైసిపి ముఖ్య నాయకులు తెలిపారు.

పేలిన ఆర్‌టిసి బస్సు టైరు

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుడివాడ నుంచి బంటుమిల్లి వెళ్తున్న పల్లెవెలుగు ఆర్‌టిసి బస్సు ముందు టైరు శుక్రవారం ఉదయం ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో పేలింది. బస్సుడ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో బస్సులోని ప్రయాణికులెవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. బస్సు కండక్టర్ ప్రయాణికులను బస్సులో నుంచి కిందికి దింపి వేరే బస్సులో ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపారు.

ట్రిపుల్ ఐటిలో ఎన్‌సిసి ఎన్‌రోల్‌మెంట్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఫోర్ ఆంధ్ర బెటాలియన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో పియుసి మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఎన్‌సిసి ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. దీనిలో భాగంగా వారికి ఎత్తు, బరువు, పరుగుపందెం, ఫిజికల్, మెంటల్, ఎబిలిటీ పరీక్షలను నిర్వహించారు. ఎఒ మేజర్ స్వాతి పాండే, ఎస్ఎం రాజ్‌పాల్, జిసిఐ ఊర్మిళ, పిఐ స్టాఫ్ హేవే, పిఇటి రెడ్డి హాజరయ్యారు. ఆర్‌జియుకెటి నూజివీడు ఎఎన్ఒ కెప్టెన్ సిహెచ్.సుబ్బలక్ష్మి పర్యవేక్షించారు. యూనివర్సిటీ యాజమాన్యం డైరెక్టర్, ఎఒ లక్ష్మణ్, అకాడమిక్ డీన్ రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో అవసరమని చెప్పారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి


ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ప్రవర్తన ఆలోచన సరళిలో మార్పులు చేసుకుంటే జీవితంలో రాణించవచ్చని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసానికి తమలో కొన్ని మార్పులు చేసుకుంటే భవిష్యత్తుకు మంచి మార్గం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పివిఎస్ఎస్‌జి.ప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన మారగాని మురళీకృష్ణ, చినబాబు గోపీ, ముళ్లపూడి సత్తిబాబుల ఆర్థిక సహాయంతో రూ.పది వేల విలువైన మోటార్‌ను హెచ్ఎం ప్రసాద్‌కు అందించారు.

వరద బాధితులను ఆదుకుంటాం

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - మండవల్లి


మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని పౌర సమాచార శాఖ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. ముంపు బారిన పడిన మణుగూరు, చావలిపాడు మహిళా మండలి కాలనీలో ఆయన కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పర్యటించి వరద బాధితులతో మాట్లాడారు. కొల్లేరు వరదతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే నీట మునిగిన గ్రామాలు, కుటుంబాల వివరాలను సేకరించినట్లు తెలిపారు. వరదల కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తుగానే అన్ని చర్యలు చేపట్టామన్నారు. చావలపాడు మహిళా మండలి కాలనీలోని 108 కుటుంబాలు వరద నీటిలో చిక్కుకుపోయిందని, అధికారులు కేవలం 20 కుటుంబాలకే నిత్యావసర సరుకులు అందించి చేతులు దులుపుకున్నారని మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతకుముందు పేద అడ్లగాడి వద్ద వరద ఉధృతిని కొల్లేటి నీటిమట్టాన్ని పరిశీలించి ఆర్‌డిఒ ఖాజావలీని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

కలెక్టర్‌ను కోరిన చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

నియోజకవర్గ అభివృద్ధికి ఉపాధి హామీ చట్టంలో పనులు కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను ఆయన శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో గుర్తించిన ఉపాధి పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. గ్రామాల్లో ప్రజలు వలసలు వెళ్లకుండా నివారించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ చట్టంలో చిన్న సన్న కారు రైతుల భూముల్లో అభివృద్ధి పనులకు, డ్రెయిన్లు, గ్రామాల్లోని శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు కేటాయించాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ స్థానికంగా ఉన్న చెరువు పూడికతీత పనులు చేపట్టాలని, యంత్రాలతో పనులు చేయించకూడదని సూచించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

మండల స్థాయి క్రీడా పోటీలను చాటపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏలూరు ఎంఇఒ-2 ఆర్.రంగయ్య శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులందరూ పాల్గొని క్రీడాంశాలను నిర్వహించారు. మండల స్థాయిలో ఎన్నికైన క్రీడాకారులు దెందులూరు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని రంగయ్య తెలిపారు. దెందులూరు గారపాటి హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్, స్పోర్ట్స్ ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, మండల కో-ఆర్డినేటర్ జె.సురేష్, మండలానికి చెందిన పీడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులు వచ్చే వారంలో జరుగే దెందులూరు నియోజకవర్గ స్థాయి ఎస్‌జిఎఫ్ ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ముసునూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు ఆటల పోటీల విభాగంలో భాగంగా కబడ్డీ, కోకో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్ ఆటలను వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్, అలీఖాన్, హేమ, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోలవరం : 2024-25 అండర్-14,అండర్-17 బాల బాలికలకు శుక్రవారం స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ క్రీడా మైదానంలో ఎంఇఒ-1 సురేష్‌బాబు, ఎంఇఒ-2 నరేంద్రరాయ్, ఎస్.శ్రీనివాస్‌బాబు, సెయింట్ ఫ్రాన్సిస్ ప్రిన్సిపల్ టినా కొరియా కోచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని పోలవరం, సెయింట్ ఫ్రాన్సిస్, చేగొండపల్లి, ఇటుకల కోట, కుంకాల, గూటాల పట్టిసీమ హై స్కూల్ నుంచి 300 మంది బాలబాలికలు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, కోకో షటిల్ బ్యాడ్మింటన్, చెస్ యోగ, అథ్లెటిక్స్ నిర్వహించిన ఆటల పోటీల్లో మండల స్థాయిలో 170 మంది బాల బాలికలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని కో-ఆర్డినేటర్ తెలిపారు.

సిఆర్.రెడ్డి కళాశాలలో హిందీ భాషా దినోత్సవం

ఏలూరు అర్బన్ : స్థానిక సర్ సిఆర్.రెడ్డి అటానమస్ కళాశాలలో హిందీ శాఖ, ఎన్ఎస్ఎస్, ఐక్యూఎసి విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం హిందీభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీభాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియ చేయడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కళాశాల కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా సెయింట్ థెరిసా మహిళా కళాశాల ప్రాచ్యభాషా విభాగపు శాఖాధ్యక్షులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్‌వి.మహాలక్ష్మి విచ్చేసి మాట్లాడారు.

విద్యార్థులకు బస్సుపాస్‌లు అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

దూర ప్రాంతాల నుంచి పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు వస్తున్న పేద విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహాలు అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భువనేశ్వరరావు అన్నారు. పూళ్ల సొసైటీ మాజీ అధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు 12 ఏళ్ల కాలంగా పాఠశాలలో బాలికా విద్యను ప్రోత్సహించే క్రమంలో, దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేసే క్రమంలో ఆర్‌టిసి యాజమాన్యం వారు విద్యార్థులకు అందించే బస్సుపాసుల ఖర్చును సమకూర్చుతున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ వై.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. బస్సు పాసుల పంపిణీ కార్యక్రమాన్ని డిపో పిఆర్‌ఒ డి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం ఆర్‌టిసి వారితో పాటు పాఠశాల యాజమాన్యం బస్సు పాసుల దాత కందులపాటి శ్రీనివాసరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డి.సుజాత,, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఏలూరు అర్బన్ : ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన పెదపాడు మండలం గోగుంట, భీమడోలు మండలం పైడి చింతలపాడు, మండవల్లి మండలం పెనుమాక లంక గ్రామాలను రైతుకూలీ సంఘం ఈ నెల 12, 13 తేదీల్లో పరిశీలించి వరద గ్రామాల ప్రజల అవస్థలను తెలుసుకుంది. కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలానికి చెందిన పెనుమాక లంక గ్రామానికి ఏలూరు నుంచి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం, పెనుమాకలంక నుంచి గుడివాడ వెళ్లే రోడ్డు పూర్తిగా నీటిలో మునిగిపోయాయన్నారు. రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ ఇప్పటివరకు రోడ్డు ఎత్తు పెంచే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదన్నారు. దాదాపుగా 350 పైగా చేపలు, రొయ్యల చెరువులు కూడా పూర్తిగా మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర సర్వే జరిపి తగు నష్ట పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఎం సహాయ నిధికి విఆర్‌ఒ సంఘం రూ.1.30 కోట్లు విరాళం ఇస్తున్నట్లు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది విఆర్‌ఒలకు సంబంధించి ఒకరోజు బేసిక్ పే వేతనం కట్ చేసేలా సిఎంకు అంగీకార పత్రం అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, కృష్ణాజిల్లా అసోసియేట్ అధ్యక్షులు శీలం నరసింహరావు, కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి అల్లడ నళిని కుమార్ ఉన్నారు.

భీమడోలు :విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గాయత్రి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహాయక చర్యల్లో భాగంగా భీమడోలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు రూ.1.50 లక్షల విలువైన సామగ్రిని పంపినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కాశీభట్ల పార్వతీశ్వరశర్మ తెలిపారు. భీమడోలు శాఖ ఆధ్వర్యంలో సుమారు 150 మంది వరద బాధిత కుటుంబాలకు సహాయపడేందుకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, ఇతరాలను సమకూర్చినట్లు తెలిపారు. వీటిని శుక్రవారం భీమడోలు శాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆటోల్లో విజయవాడకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

చింతలపూడి : వరద బాధితులకు టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అండగా నిలవటం అభినందనీయమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. టిడిపి ప్రగడవరం గ్రామ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు కలిసి వరద బాధితుల కోసం రూ.రెండు లక్షల చెక్కును సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. ఈ మేరకు ఆ చెక్కును శుక్రవారం ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు అందించారు. ఊర్లగూడెం సర్పంచి కొండిబోయిన యువరాజు రూ.50 వేలు అందించారు. మారుతీ నగర్ కాలనీ నాయకులు తాటి అప్పారావు, పోతుల శ్రీనివాసరావు, కంభం రమేష్ రూ.51 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రగడవరం మండలాధ్యక్షులు మాటూరి వెంకట రామయ్య, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు రాజారెడ్డి, టిడిపి నాయకులు గోపీ, కొమ్ము తిరుపతిరావు, మహాలక్ష్ముడు, మానేపల్లి రాజారావు, మారేష్ పాల్గొన్నారు.

కామవరపుకోట :విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇంటి చుట్టుపక్కల వారి సహాయం ద్వారా వచ్చిన సొమ్ము రూ.18,116 సిఎం సహాయ నిధికి పంపే నిమిత్తం ప్రధానోపాధ్యాయులు భీమరాజుకు అందించారు. విరాళాలు సేకరించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు అభినందించారు. విజయవాడ బాంబే నగర్ పైపుల రోడ్డు సెంటర్లో వరద బాధితులకు శుక్రవారం కామవరపుకోటకు చెందిన దాతలు భోజనాలు ఏర్పాటు చేశారు.కామవరపకోటకు చెందిన అరిటాకుల మోహన్, సుదర్శనం దుర్గబాబు, పారేపల్లి సతీష్ కుమార్ (ఆడమిల్లి సింగపూర్), కడిపి పాపారావు, వీరమల్ల మధుల ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరద బాధితుల భోజన సహాయార్థం దాతల ఆధ్వర్యంలో స్వయంగా వంటకాలు నిర్వహించి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి బాబూరావు, పిన్నమనేని మురళీకృష్ణ, రియాజ్ బాష, రాజు, పీరు, సౌజన్ సాయి, దత్తు పాల్గొన్నారు.

దెందులూరు : పెదపాడు మండలం సత్యవోలు గ్రామానికి చెందిన రైతులు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వరద సహాయక చర్యల నిమిత్తం రూ.50 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా రైతులను ఎంఎల్ఎ అభినందించారు.

రుద్రంకోట వరద బాధితులకు సాయం

వేలేరుపాడు రూరల్ :మండలంలోని రుద్రంకోట వరద బాధితులకు స్థానిక అధికారులు, కూటమి నాయకులు 25 కేజీల బియ్యం, కేజీ పామాయిల్, పంచదార, కందిపప్పు, టమాటాలు, పచ్చిమిర్చి, దోసకాయలు, దొండకాయలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రంకోట కూటమి నాయకులు, కొవ్వాల క్రాంతికుమార్, అమరవరపు వెంకన్న, శావిలి సుభాస్ చంద్రబోస్, శావిలి శివ, ముదిగొండ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి డైరెక్టర్‌గా అమరేంద్రకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి డైరెక్టర్ బాధ్యతల నుంచి ప్రొఫెసర్ చంద్రశేఖర్ రిలీవ్ అయ్యారు. ఈ నెల 17న కొత్త ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా ఎస్.అమరేంద్రకుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటివరకు కార్యనిర్వహణాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు తాత్కాలిక డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు

ముసునూరు :మండలంలోని చింతలవల్లి నుంచి చెక్కపల్లి వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక నాయకులు ఈ సమస్యను మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ.పది లక్షల నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు డిఇ తెలిపారు.